క్లుప్తంగా

వైభవంగా నందన్న తిరువీధి



నందన్నను ఊరేగిస్తున్న భక్తులు

పాలకొండ రూరల్: స్థానిక దేవరపేటలో కొలువుదీరిన నందన్నను బుధవారం రాత్రి ఊరేగించి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



వరిలో తెగుళ్లు, నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సీతంపేట: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి శ్రీదేవి అన్నారు. మండలంలోని కుడ్డపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలిచ్చారు. ఖరీఫ్ పంటల్లో వచ్చే తెగుళ్లు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజల మేలు కోరే మిత్రులు'



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై ప్రయోగమూర్తి

పాలకొండ రూరల్: పోలీసులంటే ప్రజల మేలు కోరే మిత్రులని ఎస్సై కె. ప్రయోగమూర్తి అన్నారు. బుధవారం స్థానిక తమ్మినాయడు కళాశాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీస్ విధులపై అవగాహన సదస్సు నిర్వమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసులు ప్రజా రక్షణకు కట్టుబడి ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రక్షిత నీరు అందించకపోతే ఆందోళన



సమావేశంలో పలు సమస్యలపై చర్చిస్తున్న గిరిజనులు

సీతంపేట: మండలంలోని మర్రిపాడు పంచాయతీ పరిధిలో గల ఎగువ, నడిమి, దిగువ ద్వారబందం మూడు గ్రామాలకు రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించకపోతే ఆందోళన తప్పదని గిరిజన సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల గిరిజనులతో బుధవారం సమావేశం నిర్వహించారు. మౌలిక వసతులు కల్పించాలని పలుమార్లు అధికారులను కోరినా, ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



పెట్రోల్ బంక్‌లో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాలకొండ : పట్టణంలోని పెట్రోల్ బంక్ వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. అలాగే పెంట్రోల్ బంక్ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

సేవలకు సెలవేనా...?

- తెరుచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్లు
- వెలవెలబోతున్న సచివాలయాలు
- అవస్థలు పడుతున్న ప్రజలు

పాలకొండ రూరల్:



వెలవెలబోతున్న వాటపాగు సచివాలయం

గ్రామ స్వరాజ్య స్థాపన మహాత్ముని కల. క్షేత్రస్థాయిలో జరిగే అభివృద్ధే దేశానిక వెన్నెముక అని జాతిపిత గాంధీజీ అనేక సందర్భాల్లో తెలిపారు. ఇందుకు అణుగుణంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను రూపొందించారు. లక్షలాది మంది నిరుద్యోగ యువతకు సర్కారు కొలువు అందించారు. పంచాయతీ స్థాయిలో రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు అవసరమైన ప్రతి పనీ స్థానికంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో సచివాలయం వ్యవస్థ అనతికాలంలో విజయవంతమైంది. వలంటీర్ల సహకారంతో అర్హులకు ఇళ్ల వద్దే సంక్షేమ పథకాలు అందేవి. అయితే ఇదంతా గతం.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థకు తూట్లు పొడుస్తోంది. సచివాలయాల్లో అందే సేవల్లోనూ కోత విధించింది.

ఎన్నో ప్రయోజనాలు.....

నాడు ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. దీనికి అనుసంధానంగా వలంటీర్లను నియమించారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ వారి ఇళ్ల వద్దనే సేవలందించేలా చూశారు. సచివాలయాల్లో దాదాపు 545 రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ వ్యవస్థ ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉండేది. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండేది కాదు. రిజిస్ట్రేషన్లు కూడా సచివాలయాల్లో నిర్వహించేలా వాటి స్థాయిని పెంచారు.

తెరుచుకోని వెబ్ సైట్లు.....

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సచివాలయాల వైభవం తగ్గిపోయింది. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను కుదేలు చేసిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేలా చర్యలు తీసుకుంటోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అందించే సేవలను తగ్గించుకుంటూపోతున్నారు. కులం, ఆదాయం, వన్‌బీ, తదితర సాధారణ సేవలు మాత్రమే ప్రస్తుతం సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. రేషన్‌కార్డులు, నూతన పింఛన్లు. ఆరోగ్యశ్రీ కార్డుల జారీ, తదితర వెబ్‌సైట్లు ఓపెన్ కావడం లేదు.

ఏజెన్సీలో...

మైదాన ప్రాంత ప్రజలతో పోల్చుకుంటే ఏజెన్సీ గిరిజనులకు సచివాలయ వ్యవస్థ ఎంతో మేలు చేసింది. కొండలపై, సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు పంచాయతీ, మండల కేంద్రాలకు వచ్చి పనులు చేయించుకునేందుకు ఇబ్బందిపడేవారు. సచివాలయాలు ఏర్పాటయ్యాక వారి సమస్యలన్నీ తీరాయి. నియోజకవర్గంలో సీతంపేట ఏజెన్సీలో 53 పంచాయతీల పరిధిలో 456 గూడలున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇక్కడి గిరిజనులకు సేవలు అందించే క్రమంలో 31 సచివాయాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సచివాలయంలో రోజుకు పది నుంచి 15 అర్జీలు రాగా.. వాటిని వెంట వెంటనే పరిష్కరించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

నాలుగు మండలాల్లో 98 సచివాలయాలు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 98 సచివాలయాలున్నాయి. వీటిలో దాదాపు 624 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రస్తుత కూటమి నాయకులు నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగులపై అనేక విమర్శలు చేశారు. నేడు కూటమి ప్రభుత్వానికి సచివాలయ ఉద్యోగులే దిక్కుగా మారారు. ముఖ్యంగా సామాజిక పింఛన్ల పంపిణీలో కీలకంగా ఉన్నారు.

వ్యవస్థను మరింత మెరుగ్గా నడిపించాలి..



సచివాలయాల్లో గతంలో మాదిరిగానే సేవలు కొనసాగించాలి. రేషన్, పింఛన్ కార్డులు, ఇతర అవసరాల కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకునేలా ప్రభుత్వం విధివిధానాలను రూపొందించి వెబ్‌సైట్లను అందుబాటులోకి తీసుకురావాలి. వ్యవస్థలను మరింత మెరుగ్గా నడిపిస్తే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. అంతే తప్ప గత ప్రభుత్వంపై కక్షతో వారికి పేరు వస్తున్నందన్న నెపంతో సచివాలయాలను నిర్వీర్యం చేసేలా అడుగులు వేయడం సరికాదు.

– లోలుగు విశ్వేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు, పాలకొండ

గ్రామాల్లో పొలం పిలుస్తోంది



జియ్యమ్మవలస: బిత్రపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, వ్యవసాయ సిబ్బంది



కొమరాడ: చంద్రంపేటలో రైతులకు సూచనలిస్తున్న జిల్లా రైతు శిక్షణ కేంద్రం అధికారి శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు గ్రామంలో పంట పొలాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వరి పంటను పరిశీలించి వ్యవసాయ సిబ్బంది రైతులకు పలు సూచనలు చేసారు. ప్రస్తుతం పొట్ట దశలో ఉండడంతో వరి పంటకు వచ్చే తెగుళ్లను రైతులకు వివరించారు. పొట్ట దశలో పలుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు, వీఏఏ శ్రీహరినాయుడు, సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలు ఉన్నారు.

చంద్రంపేటలో..

కొమరాడ: మండంలోని విక్రంపురం పంచాయతీ చంద్రంపేట, పరుశురాంపురం గ్రామాలో బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారి పి.శంకరరావు ఆధ్వర్యంలో పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రైతు శిక్షణ కేంద్రం అధికారి ఆర్.శ్రీనివాసరావు హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తం

- ఎస్సై అమ్మన్నరావు



మాట్లాడుతున్న ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట: సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అమ్మన్నరావు సూచించారు. బుధవారం స్థానిక వైటీసీలో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ ఎలా జరుగుతుందో వివరించారు. క్రెడిట్ కార్డ్ పేరిట మోసాలకు పాల్పడుతుంటారని, ఇంకా పలు రకాలుగా కాల్స్ చేస్తుంటారని, అటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాల బారిన పడితే తక్షణమే టోల్ ఫ్రీ నంబర్ 1930ను గాని, నేషనల్ కస్టమర్ హెల్ప్‌లైన్ 1800-11-4000 నంబర్‌కు గాని ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి భవిష్యత్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు మంచి భవిష్యత్‌ను ఇవ్వాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులదేనని ప్రిన్సిపాల్ డా.పి.శ్రీవరం అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాలలో బోధనతో పాటు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు పొందే విధంగా ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో విద్యార్థుల సామర్థ్యాలు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ రామయ్య, కోఆర్డినేటర్ శ్రీవాణి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో అన్నదాత..



తుమరాడ వద్ద యంత్ర సాయంతో వరి కోత

- ఊపందుకున్న వరి కోతలు

పాలకొండ రూరల్: వరి పంట కోత దశకు చేరిన క్రమంలో ఓవైపు సాగునీరు లేక పాలకొండ మండల రైతులు వాపోతుంటే.. మరోవైపు జిల్లాకు తుపాను ముప్పు తప్పదన్న అధికారిక ప్రకటనతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందకపోయినా, సాగుపై మక్కువతో రైతులు అప్పులు చేసి పంట పండించారు. ప్రస్తుతం మండల పరిధిలో దాదాపు 2 వేల ఎకరాల్లో తేలిక రకం వరి పంట కోతకు వచ్చింది.ఈ క్రమంలో బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం బలపడి 'దాన' తుపానుగా మారి 24, 25 తేదీల్లో తీవ్ర గాలులతో కూడిన వర్షాలు పడతాయని అధికారులు చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో బుధవారం మండలంలో దాదాపు రెండు వందల ఎకరాల్లో యంత్ర సహాయంతో కోతలు చేపట్టారు. ఇదిలా ఉంటే పంటను కాపాడుకోవడానికి వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

'దానా' ప్రభావంతో ఈదురు గాలులు

భామిని: దానా తుఫాన్ ప్రభావంతో మండలంలో బుధవారం ఈదురుగాలులు వీచాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం చల్లబడింది. బలమైన గాలులు వీయంతో భారీ చెట్లు ఎక్కడ కూలిపోతాయోనని ప్రజలు ఆందోళన చెందారు. పత్తి, మొక్కజొన్న పంటలు కొద్దిగా నష్టపోయినట్లు రైతులు చెబుతున్నారు.

గోగుపనుల్లో నిమగ్నమైన రైతులు



గరుగుబిల్లిలో గోగు నారను వేరు చేస్తున్న కూలీలు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి, గొట్టివలస, దళాయివలస తదితర గ్రామాల్లోని మెట్టుభూముల్లో పండించిన గోగు పంటకు నారతీసే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఆయా గ్రామాల్లోని చెరువుల్లో ఊరవేసిన గోగు పంటలను కూలీలచే నారను వేరుచేసే పనిలో ఉన్నారు. 40 కట్టల గోగు కర్రలకు రూ.250లు చెల్లించి గోగుకర్రల నుంచి నారను వేరు చేస్తున్నారు. గోగు కర్రలనుంచి నారను వేరుచేసేందుకు కూలీలు దొరక్కపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటకు పెట్టుబడులు ఎక్కువై గోగుపంట గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపుతున్నారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా రూపాంతరం చెందుతుందని ఈ కారణంగా ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వీఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ పి.బాల అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గురువారం నుంచి ఉత్తరాంధ్రలో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, వాగులు, నదీ తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ శివయ్య

కొమరాడ: వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.శివయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగావళి నది ముంపు గ్రామాలైన కళ్లికోట, దుగ్గి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. నదీ ప్రవాహం పెరిగితే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. వీఆర్‌ఓలంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ మల్లికార్జునరావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం..

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌ప్రసాద్



క్రీడలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, డీఎస్పీ, తదితరులు

పాలకొండ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అంతర కళాశాలల వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సహకారంతో నిర్వహిస్తున్న ఈ పోటీలను డీఎస్పీ ఎం. రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, కబడ్డీ, వాలీబాల్ పోటీలకు 28 పురుషుల జట్లు, 11 మహిళల జట్లు హాజరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో అంబేడ్కర్ విశ్వవిద్యాలయం క్రీడల బోర్డు కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, ఎ. భాస్కరరావు, ఎంఈఓ సోంబాబు, పాలకొండ మాజీ సర్పంచ్ పల్లా కొండలరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం...

- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



బిల్లుమడలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, నాయకులు

భామిని: మండలంలోని బాలేరు, నుకలజోడు, బిల్లుమడ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటామని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సతివాడకు చెందిన మండల తిరుపతిరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో, ఆయన్ను కూడా పరామర్శించారు. ఆమె వెంట వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, ఎంపీటీసీ సభ్యుడు కె.చంద్రశేఖర్, సర్పంచ్ కె.ప్రసాద్, పార్టీ నాయకులు బొడ్డేపల్లి ప్రసాద్, రొక్కం రామారావు, బోడాల చిన్నయ్యదొర, మేడిబోయిన చలపతి, ఎరుకుమజ్జి పాపినాయుడు, పిరపక శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-1 అప్పలనాయుడు

గరుగుబిల్లి: ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు బోధనను చేయాలని ఎంఈఓ దత్తి అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జెడ్పీ, యూపీ, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా అవసరమైన ప్రణాళికలు చేయాలన్నారు. పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల కమిటీకి ప్రాధాన్యత నివ్వాలన్నారు. నిర్దేశించిన మెనూ ప్రకారం పాఠశాలలో డొక్కా శీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు నిర్వహిస్తున్న ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2 లను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎంఈఓ-2 కె.కొండలరావు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు తదితరులున్నారు.

అధికారుల పనితీరు మారాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వ్యవసాయాధికారి పనితీరు మార్చుకోకపోతే ఫిర్యాదు తప్పదని ఎంపీపీ శెట్టి పద్మావతి హెచ్చరించారు. కురుపాం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వ్యవసాయ శాఖకు సంబంధించిన సమాచారం ఇవ్వకుండా ఇష్టమొచ్చినట్లు వ్యవహరించి రైతులకు తీవ్ర నష్టం కలిగించారన్నారు. రైతులకు సాగు అవసరమైన వ్యవసాయ పరికరాలు, పనిముట్లు, ఎరువులు, విత్తనాలు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్‌లు కూడా అందించడంలేదన్నారు. కేవలం 150 టార్పలిన్లు అందించి మమ అనిపించేసారని పెదగొత్తిలి సర్పంచ్ లోకనాథం అన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించాలని మొండెంఖల్ సర్పంచ్ గౌరీశంకరరావు, ఎంఈఓ సత్యనారాయణను కోరారు. పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లకు సమాచారం తెలియకుండా ఎలా ప్రతిపాదనలు చేస్తారని పలువురు సర్పంచ్‌లు ఈఓపీఆర్‌డీ రమేష్‌ను ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, తహసీల్దార్ ఎం.రవణమ్మ, జెడ్పీటీసీ జి.సుజాత, వైస్‌ఎంపీపీలు అన్నాజీరావు, రంగారావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ధ్రువీకరణ పత్రాల అందజేత



సర్టిఫికెట్లు అందుకున్న క్యాడెట్లతో అధికారులు

భామిని: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు 14వ ఆంధ్రా బెటాలియన్ ఆర్మీ అధికారి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఆర్. శివకుమార్ బుధవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఇటీవల టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో పాల్గొన్న 52 మంది సర్టిఫికెట్లు అందజేసినట్లు ప్రిన్సిపాల్ శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ బాబూరావు, ఎన్‌సీసీ కేర్ టేకర్ గొర్లె శివరాంప్రసాద్, టీచర్లు, విద్యార్థులున్నారు.

అంతర పంటలతో లాభాలు

భామిని: పసుపు పంటలో అంతర పంటలతో అదనపు ఆధాయం పొందవచ్చని వాస్సన్ సంస్థ కో ఆర్డినేటర్ కూన మనోజ్‌కుమార్ అన్నారు. మండలంలోని సన్నాయికాలనీలో పసుపులో అంతరపంటలు సాగు చేస్తున్న పొలాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది పసుపు రైతులకు రాజేంద్ర, సోనాలి పసుపు విత్తనాలు అందించామన్నారు. ఇందులో అంతర పంటలుగా వేరుశనగ, మొక్కజొన్న, కూరగాయలు సాగు చేయడం మంచిదని సూచించారు. కార్యక్రమంలో సీసీ మొదలవలస రమణబాబు, ఎఫ్ఆర్‌పీలు కీర్తిరాయి సుగ్రీవులు, బిడ్డిక లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.